క్లుప్తంగా

నేడు అదనపు తరగతుల నిర్మాణానికి శంకుస్థాపన

కొవ్వూరు: పట్టణంలో పండిత మదనమోహన్ మాలావ్య మున్సిపల్ హైస్కూలులో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత శుక్రవారం శంకుస్థాపన చేయనున్నట్టు ప్రధానోపాధ్యాయిని వి.గంగాభవానీ తెలిపారు. నేడు–నేడు పథకం–రెండో ఫేజ్‌లో రూ.1.08కోట్లతో తొమ్మిది అదనపు తరగతుల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు.

వేములూరు మాజీ సర్పంచ్ మృతి

కొవ్వూరు: వేములూరు మాజీ సర్పంచ్ మరపట్ల ఎమేలియమ్మ(72) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె 2013 నుంచి ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పని చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మరపట్ల కళాధర చక్రవర్తి ఈమెకు ఐదో సంతానం. ఎమేలియమ్మకు ముగ్గురు మగ పిల్లలు, ఆరుగురు ఆడ పిల్లలు ఉన్నారు. ఆమె మృతికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమేలియమ్మ అంత్యక్రియలు శుక్రవారం ఉదయం కొవ్వూరులోని క్రిస్టియన్ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు.

శ్రీమద్భాగవత సప్తాహాలు

కొవ్వూరు: పట్టణంలోని రామానంద గౌడీయ మఠంలో గురువారం శ్రీమద్భాగవత సప్తాహాలు ప్రారంభమయ్యాయి. సుధీర దామోదర మహారాజు వారి ప్రథమ విరహ మహోత్సవం సందర్భంగా గురువారం నుంచి 25వ తేదీ వరకూ ఈ సప్తాహం నిర్వహించనున్నట్టు మఠం నిర్వాహకుడు భక్తి విభూద వామన మహారాజ్ తెలిపారు. బృందావనం మఠం నుంచి వచ్చిన భక్తి సర్వస్వ గోవింద మహారాజ్, నవీనకృష్ణ బ్రహ్మచారి, ప్రియానంద వన మహారాజ్‌లు మాయాపూర్ నుంచి వచ్చిన జనార్దన్ మహారాజ్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

ఆవులకు లంపిచర్మ వ్యాధి

తాళ్లపూడి: మండలంలో 60 ఆవులు లంపి చర్మ వ్యాధిబారిన పడ్డాయి. తాళ్లపూడికి చెందిన రైతు కవల శ్రీనుకు చెందిన రెండు ఆవులకు లంపి స్కిన్ వాధి సోకింది. సమాచారం తెలుసుకున్న తాళ్లపూడి పశువైద్యాధికారి బాలాజీ శంకర్ ఆవులకు చికిత్స చేస్తున్నారు.

ఆయుర్వేదానికి ఆదరణ

నల్లజర్ల: కోవిడ్ తర్వాత భారతీయ సంప్రదాయ వైద్యం ఆయుర్వేదానికి ఆదరణ పెరిగిందని నేచరోపతి సంస్థ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి, తాడేపల్లిగూడెం ఆయుష్ ఆసుపత్రి వైద్యులు కె.రామకృష్ణ అన్నారు. ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టరు రామకృష్ణ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య చికిత్స పొందేందుకు వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. అన్ని రకాల జబ్బులను, దీర్ఘకాలిక వ్యాధులను శస్త్రచికిత్స అవసరం లేకుండానే తగ్గించవచ్చన్నారు. ఆయుర్వేద వైద్య చికిత్సకు వచ్చే రోగులకు యోగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ వైద్యానికి అందించే మందుల నుంచి ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టరు కె.అరవిందకుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎ.ఎస్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



బహుమతులు అందుకున్న క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే వారు భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు పొందవచ్చునని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని బసివిరెడ్డి పేటలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం ఆయన బహుమతులు అందజేశారు. బసివిరెడ్డిపేట వార్డు ఇన్‌చార్జి మేడపాటి రాంబాబు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'గడపగడపకూ' సంక్షేమ పథకాలు

- రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత
- పట్టణంలోని మూడో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం



కొవ్వూరు మూడో వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి గడపకీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని మూడో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ వరిగేటి లలిత కుమారి, అధికారులతో కలిసి మంతి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన పథకాలు, వాటి వల్ల కలిగే లబ్ధిని వార్డువాసులకు వివరించారు. అనంతరం ప్రతీ ఒక్కరి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి పరిష్కార మార్గాలు చూపిస్తూ, మరి కొన్ని సమస్యలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంధ్రోతుల అంజనీదేవి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, నాయకులు వరిగేటి సుధాకర్, బత్తి నాగరాజు, సలాది వాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

- గడపగడపకూ కార్యక్రమంలో ప్రజల విన్నపం
- దుమంతునిగూడెంలో పర్యటించిన ఎమ్మెల్యే తలారి



ధుమంతునిగూడెంలో మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ధుమంతునిగూడెం గ్రామస్తులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. గురువారం ధుమంతునిగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నిర్వహించారు. ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, మూడేన్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని ఆయన వివరించారు. ఒకొక్క కుటుంబానికి రూ.1 నుంచి 3 లక్షల వరకూ లబ్ధి పొందినట్టు ఆయన చెప్పారు. సంక్షేమ పథకాలు అందాయా? అని ప్రజలను అడిగారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, పేదల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రజలు బదులిచ్చారు. గ్రామంలో డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నామని విన్నవించుకున్నారు. డ్రైనేజీలు, రోడ్లు నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కోరారు. ఆయన స్పందిస్తూ 77 గ్రామ సచివాలయాల పరిధిలో 95,114 గడపలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నట్టు తెలిపారు. ఒక్కో గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసిందని, వాటితో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరంగం రామలక్ష్మి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ, వైస్ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సభ్యులు సత్తి జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఆచంట అనసూయ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్, కురుకూరు ఎంపీటీసీ సభ్యులు కరుటూరి సత్యానందం, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యురాలు హస్మత్ ఉన్నీషా, పార్టీ నాయకులు సత్తి సాయిఈశ్వరరెడ్డి, కడలి హైమావతి, యాదవోలు సర్పంచ్ సున్నం వర ప్రసాద్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వన సంరక్షణ నిఘాలో అటవీ ప్రాంతం



కరగపాడు సమీపంలోని అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ సత్యనారాయణ

గోపాలపురం: మండలంలోని అటవీ ప్రాంతం వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అటవీ సంపద అక్రమార్కులు కొల్లగొట్టకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్టు రాజమండ్రి అటవీశాఖ రేంజ్ అధికారి టి.సత్యనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని కరగపాడు, నల్లజర్ల, దూబచర్ల అటవీ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రవాణా అవుతున్న సుమారు 50 లక్షల వ్యయం చేసే కలప, వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు. రాజమండ్రి రేంజ్ పరిధిలో అటవీ ప్రాంతం తక్కువగా ఉందని, అటవీ ప్రాంతం వెలుపల నుంచి పోలవరం మండలం ఏరియా నుంచి వస్తున్న అక్రమ కలప రవాణాపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. రైతు వారీ జీడిమామిడి, మామిడి, జామాయిల్ తరలింపుకు ఎటువంటి ఆటంకాలు లేవని చెప్పారు. ఈయన వెంట డీఆర్ఓ సిహెచ్ శ్రీనివాసరావు, ఫారెస్ట్ బీట్ అధికారులు కార్తీక్, శ్రీను, సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కుల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ

కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్



దేవరపల్లి హైస్కూల్‌ను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్

దేవరపల్లి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల రక్షణ చట్టం కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును ఆయన పరిశీలించారు. ఇంటి వద్ద నుంచి బాక్సులు తెచ్చుకుని తింటున్న పలువురి విద్యార్థులను పరిశీలించి, భోజనం ఇంటి వద్ద నుంచి ఎందుకు తెచ్చుకుంటున్నారని ప్రశ్నించగా ఇంటి దగ్గర వంటలు బాగున్నాయని ఈ రోజే తెచ్చుకున్నామని, పాఠశాలలోనే రోజూ భోజనం చేస్తున్నామని విద్యార్థులు తెలిపారు. అనంతరం వంటశాల, డైనింగ్ హాల్‌ను ఆయన పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న వసతి దీవెన, కల్యాణమస్తు, పోషక పథకం, నాడు–నేడు కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులు, సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి, పలు సూచనలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేంద్రప్రభుత్వం పరిధిలోని అక్షరాస్యతా విభాగం ఇటీవల చేసిన సర్వేలో విద్యాపథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థాయిలో ఉందని ఆయన చెప్పారు. బాలలకు ఎక్కడైనా రక్షణ కరువైతే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలదాస్, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉస్సే శంకరుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగి వేమన జయంతి



తాళ్లపూడిలో యోగి వేమనకు నివాళులు అర్పిస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం యోగి వేమన జయంతి నిర్వహించారు. తహసీల్దార్ టి.రాధిక వేమన చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వేమయ జయంతిని నిర్వహించామని తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, ఏఎస్ఓ వెంటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు. రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం డి.దుర్గారావు, ఉపాధ్యాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు. తాళ్లపూడిలో జేవీ ప్రమోద్‌కుమార్, పరసరాధాకృష్ణ పాల్గొన్నారు.

దేవరపల్లి: పల్లంట్ల గ్రామంలో గురువారం యోగి వేమన జయంతిని నిర్వహించారు. వేమన అభ్యుదయ సంఘం ప్రతినిధి కూచిపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ క్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ కేశిరాజు సీతారామయ్య మాట్లాడుతూ యోగి వేమన పద్యాలను ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవత సంస్థ సభ్యులు, వేమన అభ్యుదల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాగల్లు: యోగి వేమన జయంతిని చాగల్లు, చంద్రవరం శాఖ గ్రంథాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథపాలకులు గద్దే శ్రీనివాసరావు, కె.సుమన్ కుమార్, రీడర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

ఉండ్రాజవరం: గ్రామాల్లో ఇంటిపన్నులు ఫిబ్రవరి నాటికి నూరు శాతం వసూలు చేయాలని ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు గురువారం సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. మండలంలో ఇంటి పన్నులను ఈనెలఖారు నాటికి 50 శాతం, ఫిబ్రవరి నెలఖారు నాటికి 50 శాతం వసూలు చేయాలన్నారు.

మితిమీరిన వేగం ప్రాణాంతకం

చాగల్లు: మితిమీరిన వేగం ప్రాణాంతకమని, నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపకపోతే చర్యలు తీసుకుంటామని చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. చాగల్లులో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని 17 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. లైసెన్సు లేకుండా, అతివేగంతో వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

నిడదవోలు రూరల్: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. అట్లపాడుకు చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు ధనుశెట్టి మణికంఠ కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వెంటబడి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

నేడు ధుమంతునిగూడెంలో గడపగడపకూ..

దేవరపల్లి: ధుమంతునిగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు,సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

కొట్లాటలో ఆరుగురిపై కేసు

నిడదవోలు రూరల్: పాత గొడవల నేపథ్యంలో యువకుడిపై దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. అట్లపాడు గ్రామానికి చెందిన ధనుశెట్టి మణికంఠకు అదే గ్రామానికి చెందిన కోరకూటి సురేష్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈనెల 18న అట్లపాడు సెంటర్‌లో ఉన్న షాపునకు వెళ్లిన మణికంఠను సురేష్‌తో పాటు పడాల జగదీష్, హఫీజ్, నజీర్, అజ్జు, అజీబ్‌లు కొట్టి గాయపర్చడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవసరానికి తగ్గ ఎరువులు వాడాలి

గోపాలపురం: వ్యవసాయంలో అవసరం మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.బోస్‌బాబు అన్నారు. వెంకటాయపాలెంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. డీడీ బోస్‌బాబు మాట్లాడుతూ రసాయన అవశేషాలు లేని పంటలు పండించడానికి రైతులు మొగ్గు చూపాలన్నారు. సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు రైతులు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, ఏఓ బి.రాజారావు వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: సారా విక్రయిస్తున్న కేసులో గజ్జరం గ్రామానికి చెందిన దేపాటి నాగేంద్రను గురువారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడి వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నాగేంద్రను కొవ్వూరు కోర్టుకి హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

దమ్మెన్నులో పారిశుధ్య పనులు

ఉండ్రాజవరం: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా దమ్మెన్ను గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు సచివాలయం, శివాలయం, ఎస్సీ, బీసీ కాలనీల వీధులను శుభ్రం చేశారు. రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, డ్రైన్లలో పూడిక తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ మాట్లాడుతూ చెత్తను తడి, పొడిచెత్తను వేరు చేసి రోడ్డుపై పడేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ పనులను సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, సెక్రటరీ వి.భార్గవీదేవి పర్యవేక్షించారు.

ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభం



అనంతపల్లిలో ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కమలకుమారి

నల్లజర్ల: అనంతపల్లి గ్రామ సచివాలయం–2లో ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచ్ కె.కమల కుమారి గురువారం ప్రారంభించారు. ఆధార్ నమోదు కేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2015 ఏప్రిల్ కుంటే ముందు ఆధార్ కార్డులు పొంది ఉంటే వెంటనే అప్‌డేట్ చేయించుకోవాలని డిజిటల్ అసిస్టెంట్ పాపా సత్యనారాయణ తెలిపారు. జెడ్పీటీసీ మాజీసభ్యులు బంక అప్పారావు, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, ఉపసర్పంచ్ కలం సత్యనారాయణ, కార్యదర్శి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్టు, ఆ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు గురువారం కోరారు. 20న దమ్మెన్ను, 21న వడ్లూరు, 23న వెలగదుర్రు, 24న కాల్దారీ గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం, తాడిమళ్ల గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ఎంపీడీఓ టి.మూర్తిబాబు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకూ ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కొవ్వూరు: డివిజన్‌లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్డీవో కె.గీతాంజలి అధ్యక్షతన ఉన్న డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. సమిశ్రగూడెం ప్రాజెక్టు పరిధిలో ఒక కార్యకర్త, ఏడు ఆయా పోస్టులకు గాను 25 మంది దరఖాస్తు చేసుకున్నారు. పెరవలి ప్రాజెక్టులో రెండు కార్యకర్తలు, ఏడు ఆయా పోస్టులకు 25 మంది, నల్లజర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఆరు ఆయా పోస్టులు, రెండు కార్యకర్తల పోస్టులకు 18 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 25 పోస్టులకు గాను 68 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు నలుగురు గైర్హజరయ్యాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.విజయకుమారి తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.వరలక్ష్మి, నల్లజర్ల, సమిశ్రగూడెం, పెరవలి సీడీపీవోలు కె.స్వరాజ్యలక్ష్మి, ఎం.ఆశారోహిణి, ఎం.శ్రీలక్ష్మి, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి కె.సత్య తదతరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్టు ఐసీడీఎస్ పీడీ విజయకుమారి తెలిపారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

నిడదవోలు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనుల్లో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ డీవీఈవో జేవీఎసెస్ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నాడు–నేడు పథకంలో 78.39 లక్షలతో చేపడుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. తరగతి గదుల షెడ్డు పైకప్పు పనులు, అన్ని గదుల్లో నిర్మించిన ఫ్లోరింగ్ మార్బుల్స్ పనుల నాణ్యతను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ వై.సరితదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.